సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

ఘనంగా భూలోకమాత పండగ



భూలోకమాత సన్నిధిలో కె.కె.రాజు, సాడి పద్మారెడ్డి తదితరులు

తాటిచెట్లపాలెం: రేసపువానిపాలెంలో గల భూలోకమాత పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కర్రి మురళీ కృష్ణారెడ్డి, గుడ్ల అశోక్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సందర్శించిన జెడ్సీ



వినతిపత్రం అందిస్తున్న తెన్నేటి పార్కు సభ్యులు

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులోని పలు ప్రాంతాల్లో జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తెన్నేటినగర్, మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ఉన్న పలు పార్కులను ఆయన సందర్శించారు. పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయా పార్కుల సభ్యులు కోరారు. తెన్నేటి పార్కులో విద్యుత్ దీపాలు, ఆట పరికరాలు, రంగులు, మొక్కలు నాటాలని తెన్నేటి విశ్వనాథం సంక్షేమ సంఘం అధ్యక్షుడు నంబాల ఈశ్వరరావు, సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వంశీనగర్ గెడ్డ పొంగిపోవడంతో జెడ్సీ తక్షణమే స్పందించి గెడ్డను శుభ్రం చేయించడంలో కీలక పాత్ర పోషించారని హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌శాలువతో సత్కరించారు.

హెచ్‌పీసీఎల్‌తో బుల్లయ్య ఎంవోయూ



ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేస్తున్న మధుకుమార్

సీతంపేట: స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాల, హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ మధ్య ఎంవోయూ జరిగింది. కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ జి. మధుకుమార్ మాట్లాడుతూ అధ్యాపకులు నూతన పరిజ్ఞానంతో సమకాలీనంగా ఉండటం ముఖ్యమన్నారు. వారు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు తక్షణమే బోధించాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సీఈవో ఇమ్తియాజ్ అర్షద్ మాట్లాడుతూ తమ సంస్థ నిర్వహిస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. కొత్త విషయాలను నిరంతరం నేర్చుకునే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు కారణంగా ఈనెల 15వ తేదీ గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సీతంపేట, శ్రీహరి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవుని సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీనివాస మకరందం దృశ్య కావ్య చరితం పవర్ పాయింట్ ప్రజంటేషన్, శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీనివాస మకరందం సంపూర్ణ ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు.

దుమ్ము రేగుతోంది

- మట్టిని తలపిస్తున్న జీటీ రోడ్లు
- ప్రధాన రహదారిలో నిర్మాణ సామగ్రి విక్రయాలు
- తరలించే సమయంలో రోడ్లపై పడుతున్న ఎర్రమట్టి, కంకర
- ప్రమాదాల బారిన పడుతున్న ద్విచక్ర వాహన చోదకులు



మట్టి రోడ్డును తలపిస్తున్న కంచరపాలెం బీఎస్‌టీఎన్ కాలనీ రహదారి



కంచరపాలెం రైల్వే గోడకు ఆనుకుని ఇంటి నిర్మాణ సామగ్రి విక్రయాలు



తిక్కవానిపాలెంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇంటి నిర్మాణపు ఇసుక

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి తాటిచెట్లపాలెం వీఐపీ రహదారికి వెళ్లే మార్గాలు మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. అటు వెళ్లే వాహన చోదకుల కళ్లల్లో మట్టి, దుమ్ము పడుతోంది. అసలే ఎండలు.. ఆపై కళ్లలో దుమ్ముతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం కూడలికి.. ఇటు కంచరపాలెం కూడలి నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే ప్రధాన రహదారి పరిధిలోకి వచ్చే కొత్తరెడ్డి కంచరపాలెం, తిక్కవానిపాలెం, ధర్మానగర్, బీఎస్‌టీఎన్ కాలనీలకు ఆనుకుని ఉన్న రైల్వే రక్షణ గోడల వద్ద ఇంటి నిర్మాణ సామగ్రి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇసుక, కాంక్రీట్, పిక్క, మట్టి, గ్రావెల్ విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. భారీ వాహనాల ద్వారా దిగుమతి చేసుకుని చిన్న వాహనాల ద్వారా కావలసిన చోటుకు తరలిస్తున్నారు. వాహనాల ద్వారా సామగ్రిని తరలించేటప్పుడు ప్రధాన రహదారుల్లో ఇసుక, రాళ్లు, పిక్క వంటివి రోడ్డుపై పడుతున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాకపోకలు సాగించే సమయంలో ఎర్రమట్టి కళ్లలో ఎగిరిపడుతుందని చెబుతున్నారు. గ్రావెల్ పిక్కతో ద్విచక్ర వాహన చోదకులు జారి పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అడిగే నాథుడు లేకపోవడంతో పడిన గ్రావెల్ మట్టి, పిక్క రోడ్లపైనే వదిలేస్తున్నారు. ఆ రహదారి రైల్వే ఆధీనంలో ఉండడంతో కనీసం విద్యుత్ దీపాలు కూడా వెలిగే పరిస్థితి కనిపించదు. చీకటి పడితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. రహదారిలో పడిన ఎర్రమట్టి బురదగా మారి ద్విచక్ర వాహనాల టైర్లు జారుతున్నాయి. స్థానిక సచివాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



ప్రయాణ సమయంలో రహదారిలో నరకయాతన పడుతున్నాం. రోడ్డుపై పడిన గ్రావెల్ అలాగే వదిలేస్తున్నారు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు కళ్లలో దుమ్ము పడుతోంది. చీకటి వేళ రాళ్లు, పిక్క వంటి వాటిపై నుంచి ప్రయాణం చేయడం వల్ల ద్విచక్ర వాహన చోదకులు జారి పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– ఎల్లాజీ, ధర్మానగర్, కంచరపాలెం



తాటిచెట్లపాలెం ప్రధాన రహదారి రైల్వేక్వార్టర్ వద్ద రహదారి ఇలా..

మంజూరు మాది.. ప్రారంభం వారిదా?

- నిధులు సిద్ధంగా ఉన్నా కొబ్బరి కాయ కొట్టే తీరిక లేదా?
- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి నిధులు శూన్యం
- డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్



46వ వార్డులో ప్రారంభానికి ఎదురు చూస్తున్న సామాజిక భవనం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కె.కె రాజు (ఫైల్)

మురళీనగర్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పడకేసిందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం అభివృద్ధికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు ఆధ్వర్యంలో 46, 49, 50, 51, 53 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. ఆ పనులకు కొబ్బరికాయ కొట్టడానికి కూడా నేటి కూటమి ప్రజా ప్రతినిధులకు తీరిక లేకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 46వ వార్డులోనే రూ.1.20 కోట్ల విలువైన సామాజిక భవనాలు నిర్మాణం పూర్తయి ప్రారంభించేందుకు ఎదురు చూస్తున్న విషయం ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతే కాకుండా 46వ వార్డులో రూ. 5 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయి అన్నీ సిద్ధంగా ఉన్నా కొబ్బరికాయ కొట్టే తీరిక వారికి లేదన్నారు. 46, 49, 50, 51, 53 వార్డుల కార్పొరేటర్లు కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకట రమణ, బర్కత్ అలీ సూచించిన అనేక పనులకు కె.కె. రాజు నిధులు మంజూరు చేయించారని ఆయన పేర్కొన్నారు. చాలా వరకు పనులకు ఆయన, స్థానిక కార్పొరేటర్ల ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేసినా పనులను సకాలంలో పూర్తి చేయలేకపోయారని సతీష్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల వార్డుల్లో నిధులు మంజూరు చేయడానికి, అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం ఆసక్తి చూపటం లేదని విమర్శించారు. 49వ వార్డులోని చాకలి గెడ్డ అభివృద్ధికి వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు విజ్ఞప్తి మేరకు కె.కె. రాజు ఆధ్వర్యంలో రూ.1.89 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలకవర్గం ఆధ్వర్యంలో మంజూరు చేసిన పనులను కూటమి ప్రజాప్రతినిధులు ప్రారంభించి, అది తాము చేసిన అభివృద్ధిగా చెప్పుకుంటున్నారన్నారు. కొత్తగా ఎన్నికైన మేయర్ తాను ప్రమాణ స్వీకారం చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని చెప్పడం వల్లనే అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని డిప్యూటీ మేయరు కటుమూరి సతీష్ విమర్శించారు. అధికారుల తీరు పట్ల స్థానిక ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సతీష్ చెప్పారు.

కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కుమారి

సీతంపేట: కిశోర బాలికల సాధికారత మనందరి బాధ్యత అని అంగనవాడీ సూపర్‌వైజర్ కుమారి అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలోని కనకమ్మవారివీధి–1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికా వికాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కౌమార బాలికల శ్రేయస్సు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 10–19 ఏళ్ల వయసును కౌమార దశగా గుర్తిస్తారని, ఈ దశలో చదువు, ఆరోగ్యం, సాధికారత అంశాలు చాలా ముఖ్యమని తెలిపారు. బాలికా సాధికారత కోసం ఐసీడీఎస్ ప్రత్యేక చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మిక వ్యవస్థ, హింస వంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, అలాగే కౌమార వయసులో విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యత తెలియజేసి, వారు సాధికారత సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కేఆర్‌ఎం కాలనీలో ఇన్‌చార్జి కమిషనర్ పర్యటన



కేఆర్‌ఎం కాలనీలో పర్యటిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధిరప్రసాద్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ జోన్–3 పరిధి కేఆర్‌ఎం కాలనీ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆకస్మిక పర్యటనే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు పరిశుభ్ర పరిచేలా చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కేఆర్‌ఎం కాలనీలో గల యార్డును పరిశీలించారు. ఇక్కడి వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించేలా చూడాలని తెలిపారు. ఈ పర్యటనలో జోన్–3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంవోహెచ్ బి. ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురూజీ రవిశంకర్ పుట్టిన రోజు వేడుకలు



రక్తదానం చేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

మురళీనగర్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ గురూజీ రవిశంకర్ జన్మదిన వేడుకలు మురళీనగర్‌లోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెహల్గామ్ సంఘటనకు ప్రతిగా త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం తెలుపుతూ భజన కార్యక్రమం నిర్వహించారు. పోలా భాస్కర్ పర్యవేక్షణలో ఎంజీ శంకర నారాయణ ఆధ్వర్యంలో రక్తదానం, చలివేంద్రాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు ఆలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ సెక్రటరీల పదోన్నతుల సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ (ఏపీ ఎస్‌డబ్ల్యుఏఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. మంగళవారం అమరావతిలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ ఆనందరావు ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్‌ను కలిసి వార్డు సెక్రటరీల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గడిచిన అయిదు సంవత్సరాల వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సేవను జూనియర్ అసిస్టెంట్‌గా పరిగణించి, అప్‌గ్రేడ్ చేయాలని, వారి తదుపరి ప్రమోషన్‌ను నోడల్ లేదా జోనల్ స్థాయిలో కొత్త పోస్టు సృష్టించి, సీనియర్ అసిస్టెంట్ పేస్కేలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ శేషుబాబు, వైస్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, స్టేట్ ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, స్టేట్ ఉమెన్ ప్రెసిడెంట్ కిరణ్మయి, జాయింట్ సెక్రటరీ పాండురంగ బెల్లంకొండ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



శ్రీదేవి పార్కులో సౌకర్యాలపై విద్యార్థితో మాట్లాడుతున్న జెడ్సీ రాము

మురళీనగర్: పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని జోన్–5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. మురళీనగర్ పరిసరాల్లోని పలు పార్కులను ఆయన మంగళవారం సందర్శించారు. తెన్నేటినగర్ పార్కు, మురళీనగర్‌లోని శ్రీదేవి పార్కు, బృందావన్ పార్కులను ఆయన సందర్శించి స్థానిక పార్కుల నిర్వహణ కమిటీలు, సందర్శకులతో మాట్లాడారు. పార్కుల్లో కావాల్సిన సౌకర్యాలపై సందర్శకులను అడిగి తెలుసుకున్నారు. శ్రీదేవి పార్కు దుస్థితిని కమిటీ సభ్యులు వివరించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, జీవీఎంసీ అధికారులు ఎస్‌ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసులతో సరి.. చర్యలు శూన్యం

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన అనధికార అంతస్థులపై 'అనుమతులు నిల్' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (ఏసీపీ) మధుసూదన్ రిజాయిండర్ విడుదల చేశారు. దాని ప్రకారం అనధికార నిర్మాణాలపై నోటీసులు జారీ చేయడం తప్ప చర్యలు శూన్యమని తెలుస్తోంది. 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో 49–38–20/ఏ డోరు నంబరులో స్టిల్ట్, గ్రౌండ్ ప్లస్–4 (నాల్గవ అంతస్థు టీడీఆర్) కోసం డీపీఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తు ప్రాసెస్‌లో ఉందని, అప్రూవల్ పొందే వరకు తదుపరి నిర్మాణాలు నిలిపివేయాల్సిందిగా భవన యజమానిని ఆదేశించినట్టు పేర్కొన్నారు. అయితే అప్రూవల్ రాకముందే జరిగిన నాల్గవ అంతస్థు స్లాబు నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో రిజాయిండర్‌లో పేర్కొనలేదు. ప్లాన్ అప్రూవల్ అయిన తర్వాత నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా జరిగిన నిర్మాణాలపై చర్యలు చేపట్టకుండా తదుపరి నిర్మాణాలు నిలిపెవెయ్యాలంటూ ఆదేశాలు జారీ చేసి చేతులు దులిపేసుకోవడం టౌన్‌ప్లానింగ్ పనితీరుకు అద్దం పడుతోంది. 26వ వార్డు శాంతిపురంలో 49–51–6/1 ఇంటి నంబరులో పాత భవనంపై అనుమతి లేకుండా నిర్మించిన అనధికార అదనపు అంతస్తును గుర్తించి మార్చి 3వ తేదీన 452 (1), 461 (1), 428, 429 నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎటువంటి నిర్మాణ పనులు అక్కడ జరగలేదని, తొలగించిన శ్లాబు మూసివేసినట్లు పేర్కొన్నారు. జీవీఎంసీ 27వ వార్డు శ్రీనగర్‌లో గెడ్డ పక్కన బఫర్ జోన్‌లో నిర్మించిన భవన యజమానికి 452(1), 461 (1), 452 (2), 461 (2) సెట్ బ్యాక్ ఉల్లంఘన, బఫర్ జోన్ ఆక్రమణ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ, ఎలక్ట్రికల్, మంచినీటి సరఫరా లైన్ డిపార్ట్‌మెంట్లకు నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. చట్ట నిబంధనను అనుసరించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే నిర్మించిన గ్రౌండ్ ప్లస్ 2 భవనంపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో రిజాయిండర్‌లో పేర్కొనలేదు.

ఏరోస్పేస్ శిక్షణకు విద్యార్థుల ఎంపిక



టెక్నికల్ ఎడ్యుకేషన్ డీడీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావుతో ఎంపికైన విద్యార్థులు

మురళీనగర్: ఏరో స్పేస్ రంగంలో పారిశ్రామిక శిక్షణకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. సాంకేతిక విద్య ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ పర్యవేక్షణలో బోయింగ్ సంస్థ ఆధ్వర్యంలో మెకానికల్ విభాగం విద్యార్థులకు మంగళవారం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ డాక్టర్ ఏవీ రామకృష్ణ మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న ఏరోస్పేస్ రంగానికి అవసరమైన మానవ వనరులను అందించే క్రమంలో ఏరోస్పేస్ ఎకో సిస్టంపై పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన పెంచేందుకు ఆరు నెలల పారిశ్రామిక శిక్షణకు విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఎంపికలు నిర్వహించామని చెప్పారు. ఏరోస్పేస్ మ్యానుఫ్యాక్చరింగ్ శిక్షణకు బోయింగ్ కంపెనీ తన సీఎస్ఆర్ నిధులను లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ద్వారా ఖర్చు చేస్తుందన్నారు. ఇంత వరకు ఈ ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో నాలుగు బ్యాచిల్లో 126 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రయోజనం పొందినట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు కంచరపాలెం, పెందుర్తి పాలిటెక్నిక్‌ల నుంచి 92 మంది విద్యార్థులు హాజరు కాగా రాత, మౌఖిక పరీక్ష అనంతరం 25 మంది శిక్షణకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. వీరికి ఈనెల 19వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డీజీఎం రోషిని మిశ్రా, సీనియర్ మేనేజర్ శేఖర్ రెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, మెకానికల్ హెడ్ కె.మధు కుమార్, పెందుర్తి పాలిటెక్నిక్ లెక్చరర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రూ. 1.6 లక్షల విలువైన గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ సిబ్బంది, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహిస్తుండగా అలీఘడ్ జిల్లా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధీరజ్ శర్మ విశాఖ స్టేషన్ మీదుగా ఢిల్లీకి అక్రమంగా గంజాయి రవాణా చేయడం ఆర్‌పీఎఫ్ సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి రూ. 1.60 లక్షల విలువైన 32 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

ఐటీసీలో గైస్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డీడీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్: ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడంలో మేటిగా నిలిచిన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) విద్యార్థులు భద్రాచలంలోని ఐటీసీ కంపెనీలో ఉద్యోగాలు సాధించి సత్తా చాటారు. వివిధ అంచెల్లో కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో వీరు విజయం సాధించారు. ఈ మేరకు ఈ కాలేజీకి చెందిన ఆరుగురు విద్యార్థులు రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో కాలేజీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నియామక పత్రాలు అలందించారు. గైస్ విద్యార్థులు సాధిస్తున్న విజయాలను డీడీ రామకృష్ణ ప్రశంసించారు. గతంలో కన్నా భిన్నంగా నయరా ఎనర్జీ, ఆటో లైవ్, వీల్స్ ఇండియా, ఆదిత్య బిర్లా వంటి కంపెనీల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు పొందడంతో 94 శాతం ఫలితాలు సాధించామని ప్రిన్సిపాల్ వెంకటరమణ చెప్పారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య : సీబీఎస్ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎం.వి.సురేష్ తెలిపారు. శ్రేయస్ కుమార్ అనే విద్యార్థి 500 మార్కులకు గాను 498 మార్కులు సాధించి విశాఖపట్నం సిటీలో చరిత్ర తిరగరాశాడని పేర్కొన్నారు. 490కి పైగా మార్కులు 18 మంది, 487కి పైగా మార్కులు 31 మంది, 480కి పైగా మార్కులు 47 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా 450కి పైగా 179 మంది విద్యార్థులు సాధించారన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సీమ, శ్రీచైతన్య కాలేజీల ఉత్తరాంధ్ర ఏజీఎం రమణ, రీజినల్ ఇన్‌చార్జి అలీ, రమణ, ప్రసాద్, కో–ఆర్డినేటర్ రాజేష్ అభినందించారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com